క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తా

కర్నూలు (టౌన్) : నగర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని నగరపాలక డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన ఎస్.వి. శివారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నగర పాలకలోని ఆయన చాంబర్‌లో పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన తాను హిందూపురం, ప్రొద్దుటూరు, కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించానన్నారు. 2022 ఆగస్టు నెల వరకు డిప్యూటేషన్‌పై తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినట్లు చెప్పారు. ప్రస్తుతం సెక్రటేరియట్‌లో బీసీ వెల్ఫేర్ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడికి డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చినట్లు చెప్పారు. అందరి సహకారంతో మంచి పాలన అందిస్తానన్నారు.

అసమానతలు లేని అభివృద్ధే సీపీఎం లక్ష్యం

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. బుధవారం సుందరయ్య భవన్‌లో అసమానతలు లేని అభివృద్ధిపై ముద్రించిన పుస్తకాలను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం రాజ్యమేలుతోందన్నారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను పాటిస్తూ మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ఫలితంగా అభివృద్ధి అసమానతలుగా విడిపోతోందన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో సీపీఎంకు అధికారం ఇస్తే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధిచేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, బి.రామాంజనేయులు, జి.రామకృష్ణ, కేవీ నారాయణ, ఆనంద్‌బాబు, సి.గురుశేఖర్, వై.నగేష్ పాల్గొన్నారు.

దేవతల విగ్రహాలు పెకిలిస్తే చర్యలు

కర్నూలు కల్చరల్: గుప్త నిధుల కోసం దేవాలయాలను కూల్చడం, దేవతల విగ్రహాలను పెకిలించడం, ఆలయాల వద్ద గుంతలు తవ్వడం లాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు హెచ్చరించారు. కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలోని కావేశమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం ప్రాంగణంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. ఆలయాన్ని సందర్శించి పరిశీలించామన్నారు. అక్కడ ఎలాంటి గుప్త నిధులు లేవన్నారు. ఆలయం శుభ్రం చేయుటకు, అక్కడ తవ్విన గుంతలను పూడ్చాలని దేవదాయశాఖ కల్లూరు మండల ఇన్‌చార్జ్‌ను ఆదేశించారు.

బాబుకు మధ్యంతర బెయిల్ రద్దు చేయాలి




మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ నాయకులు

కర్నూలు(లీగల్) : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి జారీ చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడటంతో పాటు ర్యాలీ నిర్వహించారన్నారు. బెయిల్ కండీషన్లను ఉల్లంఘించినందుకు ఆయనపై హైకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, ప్రెసిడెంట్ పి.సువర్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ షాషావలి, న్యాయవాదులు సి.వి.రామ్‌ప్రసాద్, పల్లవి, రాజేంద్రారెడ్డి, అన్నపూర్ణారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసులు, యుగంధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అనిల్‌కుమార్, శ్వేత బిందు, అర్షియా పర్వీన్ పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి

- గాల్లోకి బెలూన్లు వదిలిన కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్, కేడీసీసీ చైర్‌పర్సన్



లైట్ ఫర్ ఆక్వా కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్, అతిథులు

కర్నూలు (టౌన్): ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నగరంలోని రావూరి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం రాత్రి స్థానిక బిర్లా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న ఖానా ఖజానా వేదికగా గాల్లోకి బెలూన్లు వదిలి లైట్ ఫర్ ఆక్వా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రొయ్యలు, చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, మత్స్య శాఖ డీడీ శ్యామల,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి చిరస్మరణీయులు





ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ బీవై రామయ్య.చిత్రంలో కమిషనర్ భార్గవ్‌తేజ, పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆవోపా నేతలు

కర్నూలు(అర్బన్/టౌన్): భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని వక్తలు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలువురు అమరజీవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆవోపా సేవా సదన్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేడా వెంకటసురేష్, ఆవోపా చీఫ్ కన్వీనర్ మలిపెద్దు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ...

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఉత్సవాలను స్థానిక కృష్ణానగర్‌లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నాగేళ్ల రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు కృష్ణమూర్తి, చిలుకూరి ప్రదీప్, నాగేంద్రప్రసాద్, వరద రమేష్, పుల్లూరు సాయి, అనీల్, లక్ష్మయ్య, కిషోర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా నేతలు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలుగు జాతి ఔన్నత్యాన్ని కాపాడిన వ్యక్తి

తెలుగు జాతి ఔన్నత్యాన్ని కాపాడిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవార నగరపాలక కౌన్సిల్ హాలులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. మేయర్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలందరికి ఒక రాష్ట్రం ఉండాలని పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆయన పోరాట ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అంతకు ముందు మేయర్ మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

రెండో పటాలంలో ..

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ రవిశంకర్ అతిథిగా హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ మహబూబ్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, డీఎస్పీ భక్తవత్సలంతో పాటు పటాలం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 29వ వార్డులో రూ.40 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ

కల్లూరు: నగరంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, మేయర్ బీవై రామ య్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులో ఎస్ఎస్ఆర్ నగర్, సొసైటీ కాలనీ, హనుమాన్ టెంపుల్ లైన్ ప్రాంతాలకు తాగు నీరు అందించేందుకు రూ.40 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముఖ్య అతిథులుగా హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పరిధి రోజురోజుకు విస్తరిస్తుండడంతో అందుకు అనుగుణంగా తాగునీరుతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరంలో అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం పని చేస్తోందన్నారు. పాలక వర్గం ఏర్పడ్డాక రెండేళ్ల కాలంలో 65 ఎంఎల్‌డీ సామర్థ్యాలు గల రెండు నీటిశుద్ధి కేంద్రాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే మునగాలపాడు 15 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్రాజెక్టు పూర్తవ్వగా, రూ.130 కోట్లతో జగన్నాథ గట్టు మీద 50 ఎంఎల్‌డీల సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్, నాయకులు హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాల చంద్రారెడ్డి, సాయి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కర్నూలును కరువు మండలంగా ప్రకటించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన కోడుమూరు ఎమ్మెల్యే



కలెక్టర్ సృజనతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (సిటీ) : కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, అదే విధంగా కర్నూలు మండలాన్ని కూడా ప్రకటించాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. ఈ అంశంపై బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి విన్నవించారు. కర్నూలు మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదన్నారు. దీంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని మిగతా మండలాలతో పాటు కర్నూలును కూడా కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే ఎల్ఎల్‌సీ వాటాలో కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు బ్రాంచ్ కెనాల్ (కేబీసీ)కు రావాల్సిన నీటిని ఆయకట్టుదారులకు అందించేలా జలవనరుల శాఖ ఇంజినీర్లను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. కేబీసీ పరిధిలో ఖరీఫ్ కింద సాగు చేసిన సుమారు 3 వేల ఎకరాలకు నీటి తడులు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు కోడుమూరుకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని తొలగించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో రాయల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ పరీక్షలంటేనే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురువుతుంటారని దీన్ని అధిగ మించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పబ్లిక్ పరీక్షలను సాధారణ పరీక్షలాగానే భావించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కఠిన అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించి విషయ పరిజ్ఞానం కల్పించాలన్నారు. విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలంటనే భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదన్నారు. సమాఖ్య నాయకులు సుజాత, బ్రాహ్మణి, భారతి, ఆదిలక్ష్మి, సుధా వర్షిణి, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ బాషా మృతికి నివాళి

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్ఆర్టీసీ ఎస్డబ్ల్యూఫ్ రీజినల్ మాజీ అధ్యక్షుడు సర్దార్ బాషా మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు నివాళి ప్రకటించారు. బుధవారం ఉదయం ఆయన మరణ వార్తను తెలుసుకుని ఇంటికి వెళ్లి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అవీ-ఇవీ

ఐసీఎస్‌పీ చైర్మన్‌గా డాక్టర్ అరుణ్

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ క్రిస్టియన్ సెక్యులర్ పార్టీలో మెడికల్ హెల్త్ ఎడ్యుకేషన్, ఫ్యామిలి అండ్ సోషల్ వెల్ఫేర్ వింగ్‌కు చైర్మన్‌గా కర్నూలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అరుణ్‌ను జాతీయ అధ్యక్షుడు స్లీవ జిల్లెలి నియమించారు. జిల్లా, జోనల్ స్థాయిలో నిర్వహించే కార్యకమాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని డాక్టర్ అరుణ్ తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కర్నూలు సిటీ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా బుధవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు సె నో టు కరెప్షన్ కమిటీ టూ ది నేషన్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ విజిలెన్స్ అధికారి రాజశేఖర్, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ అనంతకుమార్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ దేవికా రాణి, తదితరులు పాల్గొన్నారు.

27,28 తేదీల్లో మహాపడావు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక విధానాలను నిరసిస్తూ ఈనెల 27,28 తేదీల్లో మహా పడావు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, డి.అంజిబాబు తెలిపా రు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో మహాపడావు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులతోపాటు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి నాగన్న, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు కె. జగన్నాథం, రామకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు వెంకటేష్, వెంకటస్వామి హాజరై చర్చించారు.

ఎల్లమ్మ గుడిలో చోరీకి యత్నం

కర్నూలు (టౌన్): కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం తెల్లవారు జామున ఇద్దరు దొంగలు చోరీకి యత్నించారు. గుడి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్తుండగా గస్తీలో ఉన్న పోలీసులు అటుగా వెళ్లారు. గమనించిన దొంగలు అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించగా వెంబడించి పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

స్వయం సహాయక సంఘాలను డీసీసీబీకి బదిలీ చేయండి

- రూ.20 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధం
- కలెక్టర్‌కు వివరించిన డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి



జిల్లా కలెక్టర్ సృజనకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు (అగ్రికల్చర్) : జిల్లాలోని అన్ని స్వయం సహాయక సంఘాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు బదిలీ చేయాలని చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి కోరారు. ఈ విషయంపై బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జి.సృజనను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార బ్యాంకులను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉన్నారని, ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు రుణాల పంపిణీ సహకార బ్యాంకుల ద్వారానే చేపడుతున్నారని పేర్కొన్నారు. కర్నూలు డీసీసీబీ కూడా తక్కువ వడ్డీతో ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తుందని పేర్కొ న్నారు. జిల్లాలో అర్హత కలిగిన అన్ని స్వయం సహా యక సంఘాలకు రుణాలు పంపిణీ చేసి వారి అభివృద్ధికి దోహదపడాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని విషయాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య
- 62 సచివాలయంలో రోగులకు ఉచితంగా వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య



జాతీయ కౌమార ఆరోగ్య కార్యక్రమ పోస్టర్ విడుదల చేస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత

కర్నూలు (టౌన్) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం స్థానిక 24 వ వార్డు పరిధిలోని 62 వ సచివాలయం విద్యా వికాస్ పాఠశాల ప్రాంగణంలో, 13 వ వార్డు బంగారుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను ప్రారంభించిన మేయర్ అక్కడి రోగులు, ప్రజలతో మాట్లాడారు. వైద్య సిబ్బందితో మందుల గురించి ఆరా తీశారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందజేయాలని సూచించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందుకు ఒకటి, రెండు రోజులకు పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని వార్డులు, సచివాలయాల పరిధిలో 45 రోజుల పాటు ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో రోగులు, ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలు లేవన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి పేదల పట్ల చిత్తశుద్ధి ఉండటంతో కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందజేస్తుందన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కన్వీనర్ ఆసిఫ్ సయ్యద్, 13 వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు కేదార్నాత్, డిష్‌రాజు, కల్పన, సుచరిత, మైఖేల్, శ్రీనివాసులు, ఏలియా, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు రక్ష లభిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన స్థానిక శ్రీరామనగర్, వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడకు వచ్చిన రోగులకు అన్ని వైద్యసేవలు అందుతున్నాయా లేదా, వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారా, అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు చేస్తున్నారా, మందులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. అవసరమైన వారికి ఉన్నత వైద్యం కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. స్పెషలైజేషన్ వైద్యులు ఉన్నారా లేదా అని పరిశీలించారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు కేస్‌షీట్స్, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రింట్ అయిన బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు. ఆశ, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ప్రతి ఇంట్లో ఉన్న రోగులను పలకరించి వైద్యశిబిరానికి తీసుకురావాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

రక్తహీనత నివారణకు పటిష్ట చర్యలు

మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. బుధవారం ఆమె స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బాలింతలకు, గర్భవతులకు, కిశోర బాలికలకు రక్తహీనత వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ఐరన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. మునగాకు, ఆకుకూరలు, బెల్లంతో తయారు చేసిన పదార్థాలు, పచ్చికొబ్బరి, నువ్వులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్ఆర్ పోషణకిట్ తీసుకోవడం ద్వారా ఐరన్‌లోపాన్ని అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు డాక్టర్ శ్రీరాములు, సామాజిక ఆరోగ్య అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు వసూలు చెయ్యరా?

- రెవెన్యూ సిబ్బందిపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి

కర్నూలు (టౌన్): 'రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల వారీగా ఎమినిటీస్ కార్యదర్శులు ఉన్నారు. అయినా, ఎందుకు పన్నులు వసూళ్లు కావడం లేదు. మీరేం చేస్తున్నారు' అంటూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో అడిషనల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో వివిధ పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.12 లక్షల పన్ను దారుల నుంచి ఏడాదికి రూ. 73 కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. మొదటి అర సంవత్సరం ముగిసినా 49 శాతం మాత్రమే వసూళ్లయ్యాయన్నారు. నీటి పన్ను వసూళ్లకు సంబంధించి డీఈఈలు, ఏఈలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సచివాలయాల ఉద్యోగులతో ఎందుకు మానిటరింగ్ చేయడం లేదని ప్రశ్నించారు. సి.క్యాంపు రైతుబజార్ మున్సిపల్ షాపుల యజమానులు పన్ను బకాయిలు చెల్లించకపోతే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో పన్నులు వసూలు కాకుంటే ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తామని హెచ్చరించారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు రక్తహీనతకు గురిగాకుండా కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి వారితో చర్చించారు. గర్భిణిలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్ ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

కర్నూలు(సెంట్రల్) : ప్రజా సమస్యలపై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అజాద్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య సర్కిల్, జోహరాపురంలలో డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో డీవైఎఫ్ఐ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశ సంపద కార్పొరేటర్లకు దోచి పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వలి,నాగరాజు, కుమార్, కృష్ణ, రాజేష్, జోసెఫ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనను స్వాగతిస్తున్నాం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్) : రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను గుర్తించడాన్ని సీపీఐ స్వాగతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.రామచంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు మండలాలను ప్రకటించిన ప్రభుత్వం..యుద్ధ ప్రతిపాదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. జిల్లాలో 24 మండలాలను కరువుగా ప్రకటించారని,ఆయా మండలాల్లో పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, జొన్న, కొర్ర పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని, విద్యార్థుల అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, ఎస్.మునెప్ప, కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అధికారులను కోరారు. బుధవారం ఆయన జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ నారాయణతో కలసి కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గ్రామ పరిధిలోని 2 నుంచి 666 వరకు, 538 నుంచి 558 వరకు ఉన్న సర్వే నంబర్లలోని ప్రభుత్వ బంజరు,అసైన్‌మెంట్ భూములను అదే గ్రామానికి చెందిన సలీం, శంకర్, ఇదూర్‌బాష, విజయరెడ్డిలతోపాటు మరికొందరు బినామీ పేర్లతో సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే, ప్రస్తుతం గ్రీన్ కో కంపెనీ పెట్టే గాలిమరల కోసం అవసరమైన మట్టిని వారు ప్రభుత్వ భూములను తవ్వించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వెంటనే ఆయా సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆయన ఆర్‌డీఓను కోరారు.

తొలి రోజు 23,705 మందికి పెన్షన్లు



పెద్దాసుపత్రిలో ఫజుల్లాకు వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ జగదీష్

కర్నూలు (టౌన్) : నగరంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగుతోంది. ఉదయం 7 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలో మొత్తం 33, 957 పెన్షన్లు ఉన్నాయి. ఇందులో తొలి రోజు 23,705 మందికి రూ.6.65 కోట్లు అందజేశారు.ఈ నెల 5 లోపు వందశాతం పెన్షన్ పంపిణీ చేస్తామని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు.